ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5**
మంగళవారం 29 ఏప్రిల్ 2025



'ఎర్లీబర్డ్'కు స్పందన



- జిల్లాలో రూ.4.92 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు
- రాష్ట్రంలోనే రాయికల్ మున్సిపాలిటీకి పదో స్థానం
- రేపటితో ముగియనున్న పథకం

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఎర్లీబర్డ్ స్కీమ్‌కు పట్టణవాసులు బాగా స్పందించారు. ఆస్తి పన్ను చెల్లింపులో ఐదుశాతం రాయితీ అవకాశాన్ని వినియోగించుకున్నారు. దాదాపుగా 18.21 శాతం మంది ఆస్తి పన్ను చెల్లించారు. తద్వారా బల్దియాలకు ఒక్క నెలలోనే రూ.కోట్లలో ఆదాయం వచ్చింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలు ఎర్లీబర్డ్ ద్వారా అంచనా మేరకు ఆదాయాన్ని సాధించాయి. ఇందులో అత్యధికంగా రాయికల్ మున్సిపాలిటీకి, అత్యల్పంగా ధర్మపురి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చింది. ఈనెల 30వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లింపులో రాయితీ పొందడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

● జిల్లాలో రూ.27.85 కోట్ల ఆస్తి పన్ను లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీల్లో 71,246 గృహాలున్నాయి. ఇందుకుగాను 2025-26 ఆర్థికసంవత్సరంలో రూ.27.85 కోట్ల ఆస్తిపన్ను రాబడి సాధించాలన్న లక్ష్యంతో అధికారులు ముందుకు వెళ్తున్నారు. ఇందులో జగిత్యాల మున్సిపాలిటీలో 27,683 గృహాలు ఉండగా రూ.13.08 కోట్ల ఆస్తి పన్ను, ధర్మపురి మున్సిపాలిటీలో 4,736 గృహాలు, రూ.1.52 కోట్లు ఆస్తి పన్ను లక్ష్యంగా నిర్ణయించారు. కోరుట్లలో 19,512 గృహాలు, రూ.6.05 కోట్ల ఆస్తి పన్ను, మెట్‌పల్లిలో 13,884 గృహాలు, రూ.5.94 కోట్ల ఆస్తిపన్ను, రాయికల్ మున్సిపాలిటీలో 5,431 గృహాలు, రూ.1.26 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలన్న లక్ష్యం నిర్ణయించబడింది.

● మున్సిపాలిటీల్లో వసూళ్లు ఇలా..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ఎర్లీబర్డ్ కార్యక్రమం ద్వారా ఈనెల 27వ తేదీ వరకు రూ.4.92 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలోని రాయికల్ మున్సిపాలిటీ ఎర్లీబర్డ్ స్కీంతో ఆస్తి పన్ను వసూళ్లలో అగ్రస్థానంలో ఉంది. రాయికల్ మున్సి పాలిటీలో 966 గృహాలకు చెందిన రూ.29 లక్షల ఆస్తి పన్నును వసూ లు చేసి 23.02 శాతం లక్ష్యాన్ని సాధించింది. కోరుట్ల మున్సి పాలిటీలో 4,091 గృహాలకు చెందిన రూ.1.30 కోట్ల ఆస్తి పన్నును వసూలు చేసి 21.49 శాతం లక్ష్యాన్ని సాధించింది. మెట్‌పల్లి మున్సిపాలిటీలో 3,032 గృహాలకు చెందిన రూ.1.15 కోట్లు ఆస్తి పన్నును వసూలు చేసి 19.36 శాతం లక్ష్యాన్ని సాధించింది. జగిత్యాల మున్సిపాలిటీలో 4,588 గృహాలకు చెందిన రూ.2 కోట్లు ఆస్తి పన్నును వసూలు చేసి 15.29 శాతం లక్ష్యాన్ని సాధించింది. ధర్మపురి మున్సిపాలిటీలో 822 గృహాలకు చెందిన రూ. 18 లక్షల ఆస్తి పన్నును వసూలు చేసి 11.84 శాతం లక్ష్యాన్ని సాధించింది.

● 18.21 శాతం వసూలు

ఎర్లీబర్డ్ పథకం పాత బకాయిలు లేని, కొత్త ఆర్థిక సంవత్సరం 2025-26 ఆస్తి పన్ను చెల్లించే వారికి వర్తిస్తుంది. ఎర్లీబర్డ్ రాయితీ వినియోగించేకోవాలనుకుంటే ముందు బకాయిలన్నీ చెల్లించాలి. పాత బకాయిలు కాకుండా, ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను సైతం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో 30 శాతం నుంచి 40 శాతం వరకు ఆస్తి పన్ను వసూలు చేశారు. ఒక్క ధర్మపురి మున్సిపాలిటీలో మాత్రమే 11.84 శాతం వసూలైంది. మున్సిపాలిటీలకు వచ్చే ఆస్తి పన్నులో దాదాపుగా...

మిగతా 8లో

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

-మంత్రి సీతక్కకు విప్ అడ్లూరి వినతి



మంత్రి సీతక్కకు వినతిపత్రం సమర్పిస్తున్న విప్ అడ్లూరి

పెగడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గంలో వంతెనలు, రోడ్ల నిర్మాణాలకు సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయాలని సోమవారం మంత్రి సీతక్కకు ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వినతిపత్రం సమర్పించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్ ఠాకూర్‌తో కలసి లక్ష్మణ్ కుమార్ మంత్రి సీతక్కను క్యాంపు కార్యాలయంలో కలిశారు. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామం నుంచి పద్దులగుట్ట వరకు వంతెన, రోడ్డు నిర్మాణానికి రూ2 కోట్ల రూపాయలు, ధర్మారం మండలం తెనుగువాడ నుంచి ఎండపెల్లి ఎక్స్ రోడ్డు తారు రోడ్డు నిర్మాణానికి రూ.3.20 కోట్ల నిధులను మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో ఎన్ఆర్ఐ గంగపుత్ర సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన గంగపుత్ర భీష్మ క్రికెట్ ట్రోఫీ-2025 సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో కోరుట్ల విన్నర్‌గా నిలవగా, జగిత్యాల టీమ్ రన్నర్‌గా నిలిచాయి. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు అడువాల లక్ష్మణ్, తిరుపతి, ఆరుముల్ల పవన్, మాజీ కౌన్సిలర్ జుంబర్తి రాజ్‌కుమార్, వీరబత్తిని శ్రీనివాస్‌తో పాటు నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

-ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



తేమ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని అందుకే ప్రభుత్వంతో కలిసి జగిత్యాల అభివృద్ధి కోసం పని చేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 15వ వార్డు శంఖులపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రూ.85లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టామన్నారు. వాటర్‌ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిరుపేదలకు వరం అన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.20వేల కోట్ల రుణమాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్‌తో రైతులకు లబ్ధి చేకూర్చుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్లు గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ తోట మల్లిఖార్జున్, మెప్మా ఏవో శ్రీనివాస్, ఏఈ అనిల్, సీనియర్ నాయకులు బాల ముకుందంతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మక నిర్ణయం

-మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ అనేది చరిత్రాత్మక నిర్ణయమని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌ను అసెంబ్లీలో ఆమోదం తెలిపి మాదిగలకు పెద్ద దిక్కు అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రమంతటా ఎస్సీ వర్గీకరణపై విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్నామని అందులో భాగంగా జగిత్యాలకు కార్యక్రమం నిర్వహించామన్నారు. సోమవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ అమలు చేసిన ముఖ్యమంత్రికి మాదిగలంతా రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మెడపట్ల దుబ్బయ్య, గుడికందుల మహేష్, గొర్రె రంజిత్, మోర్తా రాజశేఖర్, గంగాధర్, సంజీవ్, కులపాక చందు మోతె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

పెగడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.రవీందర్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు మార్కెట్ యార్డులోని రైతు వేదికలో భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌లు హాజరవు తున్నందున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

కథలాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హరితహారం నర్సరీలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఎం రాజేందర్ సూచించారు. సోమవారం మండలంలోని దూలూరులో నర్సరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలకు నీరు ఎప్పటికప్పుడు అందించాలని అన్నారు. వచ్చే ఏడాదిలో చేపట్టబోయే గ్రామానికి 40 వేల మొక్కల పెంపకంపై ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వైభవ్, కారోబార్ వినోద్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కథలాపూర్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రూ.1.3 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులను ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిధులు మంజూరు చేయగా పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, రాష్ట్ర ఫిషరీష్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్ ఉన్నారు.

'భూ భారతితో సమస్యలు పరిష్కారం'

ఎండపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో ఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతీ గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారానికి భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు సుధన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మెన్ గుండాటి గోపిక జితెందర్ రెడ్డి, తహశీల్ధార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

మేడిపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ మండలంలోని కొండాపూర్, కాచారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో జరగాలని అన్నారు. కొనగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దారు వసంత, ఏవో షాహిద్ అలి,ఆర్ఐ రమేష్, ఏపీఎం అశోక్, ఏఈవో సురేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఉద్యోగులు

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరులకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళులు అర్పించారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతులకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ భారతీయులపై ఉగ్రవాదుల దాడి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ జగిత్యాల జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవిబాబు, కో చైర్మన్ ఎండీ వకీలు, కలెక్టరేట్ కార్యాలయ ఏట షాదబ్ హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

● మల్లాపూర్ మండల కేంద్రంలో..

మల్లాపూర్, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పర్యాటకుల ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ మల్లాపూర్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి ముస్లిం మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మండలాధ్యక్షుడు అబ్దుల్ రజాక్, నాయకులు బషీర్, తక్కియుద్దిన్, బాబా ఫరీద్, సల్మాన్, మహబూబ్, షబ్బీర్, మహమ్మద్ రఫీ, అబ్దుల్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలను

సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలకు పదును పెట్టేందుకు జిల్లాలోని 10గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ తెలిపారు. జిల్లాలో మే 1 నుంచి 31వరకు ఈ శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు. క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే శిక్షకుల ఎంపిక పూర్తి అయ్యిందన్నారు. వేసవి క్రీడా శిబిరాల్లో 14 సంవత్సరాలు గల బాలబాలికలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన జడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణాలతో పాటు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా యువజన క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ తెలిపారు. ప్రతి క్రీడా మైదానంలో మెడికల్ కిట్‌తో పాటు, నీటి వసతిని ఏర్పాటు చేయనున్నట్లు రవి కుమార్ తెలిపారు. వాలీబాల్ క్రీడలకు జడ్పీహెచ్ భూపతిపూర్‌లో సీహెచ్ ప్రతాప్‌రెడ్డి 9440922296, జడ్పీహెచ్ వెల్లటూర్‌లో సతీష్ 9059501017, జడ్పీహెచ్ లక్ష్మీపూర్‌లో కోటేశ్వర్ 9963159111, జడ్పీహెచ్ గొల్లపల్లిలో పవన్ 8186870870, జడ్పీహెచ్ ఎండపల్లిలో కొమురయ్య 9182406818 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. జడ్పీహెచ్ కథలాపూర్ మండలం ఊట్పల్లిలో ప్రవీణ్ 9701710968, అథ్లెటిక్ క్రీడలకు సూర్యగ్లోబల్ స్కూల్ జగిత్యాలలో శ్రీకాంత్ 9550963101, ఎండపల్లి తెలంగాణ క్రీడా మైదానంలో శివమణి 8367588646, హ్యాండ్ బాల్ క్రీడలకు ఎండపల్లి మండలం జడ్పీహెచ్ గుల్లకోటలో సాయి కుమార్ 7893472246, సాఫ్ట్‌బాల్ క్రీడా శిక్షణకు జడ్పీహెచ్ మల్లన్నపేటలో శ్రీకాంత్ 7702294312 నంబర్లలో సంప్రదించాలని జిల్లా యువజన క్రీడల అధికారి రవి కుమార్ సూచించారు.

ఎల్ఎండీలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


నరసమ్మ(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికిచెందిన కెడిక నరసమ్మ (60) తన భర్తతో కలిసి ఉంటోంది. వారి కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అయితే నరసమ్మ భర్త తిరుపతి రెడ్డికి ఇటీవలే హార్ట్‌స్ట్రోక్ వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో నరసమ్మ తన భర్తకు సేవచేస్తూ ఆమె కూడా అనారోగ్యానికి గురైంది. కుమారులు కూడా అందుబాటులో లేకపోవడంతో తమని చూసుకొనే వారులేరని మనస్తాపం చెందింది. ఆదివారం ఈనెల27న కరీంనగర్ వెళ్లి వస్తానని భర్తకు చెప్పి సాయంత్రం ఇంట్లో నుంచి బయలుదేరింది. రాత్రి ఇంటికి వెళ్లకుండా నరసమ్మ ఎల్ఎండీలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం మానేరుడ్యాంలో మృతదేహం కనిపించడంతో స్థానికులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదేహం ఎవరిదనే సమాచారం లేకపోవడంతో సోషల్‌మీడియాలో మృతురాలికి సంబంధించిన వివరాలు పెట్టడంతో వైరల్ అయ్యాయి. దీంతో సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు కెడికనరసమ్మగా గుర్తించి ఎల్ఎండీ పోలీసులను సంప్రదించారు. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి బలవన్మరణం


జంగ మల్లయ్య(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో నివాసముండే జంగ మల్లయ్య(80) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతుళ్లు, కొడుకు వద్దకు వెళ్లకుండా ఒంటరిగా ఉంటున్నాడు. ఒంటరితనంతో మనస్తాపంచెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి కూతురు ప్రమీల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీనగర్‌కు చెందిన తిప్పర్తి హరికృష్ణ(35) దుర్మరణం చెందాడు. తిప్పర్తి పరిపూర్ణాచారి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. కోతిరాంపూర్ మూలమలుపు వద్ద కారు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా హరికృష్ణ మృతిచెందగా, పరిపూర్ణాచారి చికిత్స పొందుతున్నాడు. హరికృష్ణ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

● వరి కోత యంత్రాలతో జాగ్రత్త

● నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ముప్పు

వెల్గటూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. కూలీల కొరత నేపథ్యంలో జిల్లాలో అన్నదాతలు వరి పంట కోయడానికి కోత యంత్రాలు (హార్వెస్టర్)పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాగా హార్వెస్టర్లు నడిపే పలువురు ఆపరేటర్ల అజాగ్రత్త ప్రతీ ఏటా ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ సంఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు అంగవైకల్యంతో జీవితాంతం బాధపడుతున్నారు. ఆపరేటర్ల కొరత వలన ఎక్కువ గంటలు విశ్రాంతి లేకుండా పని చేయడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక, రవాణా శాఖ అధికారులు హార్వెస్టర్ల యజమానులు, ఆపరేటర్లకు నిబంధనలు, రక్షణ చర్యలపై సీజన్ ఆరంభం ముందే అవగాహన కల్పిస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది.

ఆపరేటర్లు పాటించాల్సిన జాగ్రత్తలు

● హార్వెస్టర్ విడి భాగాలు సరిగా పనిచేస్తున్నదీ.. లేనిదీ పొలంలోకి దిగక ముందే సరిచూసుకోవాలి.

● పని లేనపుడు వాలు ప్రదేశాల్లో నిలిపి ఉంచడం, టైర్ల కింద రాళ్లు అడ్డుపెట్టడం ప్రమాదకరం.

● యంత్రం మరమ్మతుకు గురైతే నిపుణులతోనే తనిఖీ చేయించాలి.

● కన్వేయర్ బెల్టు వంటి భాగాలు మరమ్మతు చేయాల్సి వస్తే అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలి.

● వర్షం, పొగమంచు సమయాల్లో పొలంలో నీళ్లు ఎక్కువగా ఉన్నప్పుడు కోత పనులు చేయవద్దు.

● ఇంజన్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఏ పని చేయొద్దు.

● బురద ఉన్నపుడు కోత పనులు చేస్తే యంత్రాలు అందులో కూరుకునే ప్రమాదముంది.


రైతులు, కూలీలు పాటించాల్సినవి..

● హార్వెస్టర్ వెనుక భాగం ఆపరేటర్‌కు కనిపించదు. కోత కోసే సమయంలో ముఖ్యంగా చిన్న పిల్లలు, దివ్యాంగులు యంత్రాల వద్దకు వెళ్లవద్దు.

● హార్వెస్టర్ కదులుతున్నపుడు ఎక్కడం, దిగడం చేయవద్దు.

● రహదారులు, పొలాల్లో అడ్డు వచ్చే కరెంటు తీగలను ఎండిన కర్ర, లేదా రబ్బరు, ప్లాస్టిక్ సాధనాలతో పక్కకు తొలగించాలి.

● యాసంగి కోతల సమయంలో యంత్రాల వద్ద అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.



భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

జూలపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన సుమలత(31) అనే వివాహిత ఐదు రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్తసురేష్ సోమవారం జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమలత తో సురేష్‌కు 9 సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల వారి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఈనెల 25నఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిందని సురేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, సుమలత ఆచూకీ తెలిస్తే 8712658670, 8712656513 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శంకరపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8400 నగదు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

పెద్దపల్లిలో పట్టపగలు దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణమా?


పోలం కుమార్ (ఫైల్)


హత్య అనంతరం అక్కడే కూర్చున్న సంతోష్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సోమవారం పట్టపగలే దారుణ హత్య జరిగింది. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తెలుస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికిచెందిన వేల్పుల సంతోష్ కుమార్.. పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికిచెందిన పోలం కుమార్(35)కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్నాడు. ఈ విషయమై దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఒకసారి మాట్లాడుకుందామని పోలం కుమార్‌ను సంతోష్‌కుమార్ వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రమ్మన్నాడు. సంతోష్ కుమార్ భార్యతో కలిసి మార్కెట్‌యార్డ్‌కు వచ్చాడు. అనంతరం వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకొంది.

ఈ క్రమంలో సంతోష్‌కుమార్ వెంట తెచ్చుకున్న కత్తితో పోలంకుమార్‌పై కిరాతంగా దాడిచేశాడు. చనిపోయి తరువాత కూడా మర్మాంగాలపై కాలితో నొక్కి కసి తీర్చుకున్నాడు. దీంతో పోలం కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సంతోష్‌కుమార్ మృతదేహం ఘటనస్థలం వద్దనే కూర్చొని నీరు తాగుతూ సేదతీరాడు. సంఘటనను చూసిన సంతోష్‌కుమార్ భార్య సొమ్మసిల్లి పడిపోయింది. విషయంతెలుసుకొన్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ఆమెను ఆస్పత్రికి, సంతోష్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ ఘటన జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న వారు ఫొటోలు, వీడియోలు తీశారే కానీ ఎవరూ అడ్డుకోలేదు. ఈ ఘటనపై డీసీపీ కరుణాకర్ విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా హత్యకు గురైన కుమార్ భార్య అనిత తన భర్తను సంతోష్, అతడి భార్య శైలజ పథకం ప్రకారమే హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాభర్తని వ్యవసాయ మార్కెట్‌కు రమ్మని ఫోన్‌చేసి చెప్పడంతో కారులో అక్కడికి వెళ్లాడని ఈ క్రమంలో కత్తితో పొడిచి చంపారని పేర్కొంది.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

సైదాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారం గ్రామంలో సోమవారం ఆటోబోల్తాపడి ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండల రేగొండ గ్రామానికి చెందిన మైలారం శారద, చెంచల వనజ, బరిగల శారద, రెంటాల స్వరూప, కల్వల లలిత, కనక మమత, గాదెపాక సౌమ్య, రెంటాల వెన్నెల రేకొండ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమారం గ్రామసమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్పగాయాలు కాగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి స్వల్పగాయాలు

హుజూరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్‌లో సోమవారం కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రోడ్‌లోని వెంకటసాయి గార్డెన్ సమీపంలో రహదారిపై వస్తున్న కారును తప్పించబోయిన మరోకారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలు కాగా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

బోల్తాపడిన సున్నపు లోడ్ లారీ

మానకొండూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామశివారులో సోమవారం సున్నపులోడ్ లారీ బోల్తాపడింది. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న సున్నపులోడ్ లారీ గట్టుదుద్దెనపల్లి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న గోదావరిఖని ఏసీపీ మడత రమేష్

కమాన్‌పూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ముగ్గురిని కమాన్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏపీపీ మడత రమేష్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. కమాన్‌పూర్ మండలం గుండారం శివారులోని రాజేందర్‌నగర్ వద్ద ముగ్గురు వ్యక్తులు రెండు కిలోల గంజాయి తరలించేందుకు సిద్ధంగా ఉండగా పక్కా సమాచారంతో ఎస్ఐ కొట్టే ప్రసాద్ దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. గంజాయిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు మండల కేంద్రానికి చెందిన సవలం మల్లేష్, జగిత్యాల జిల్లా గుడిసెలపేటకు చెందిన అలక సందీప్, మద్దెల హరీష్‌లను అరెస్టుచేసినట్లు తెలిపారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఎవరైనా గంజాయి సాగుచేసిన, తరలించిన, విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గోదావరిఖని టూటౌన్‌సీఐ నక్క ప్రసాద్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

● ప్రతీ రోజు కొడుకుపై దాడి

● గొడ్డును బాదినట్లు బాదుతుండడంతో భరించని ఇరుగుపొరుగు

● రహస్యంగా వీడియో తీసి సఖి అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు

● సఖి సెంటర్‌కు తల్లీకొడుకుల తరలింపు ● జగిత్యాల తులసీనగర్‌లో ఘటన


జగిత్యాల సఖి కేంద్రంలో అధికారుల వద్ద ఉన్న బాలుడు

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా ఓ కన్నతల్లి కర్కశత్వం ప్రదర్శించింది. కొడుకును తల్లే నిత్యం గొడ్డును బాదినట్లు బాదుతోంది.. మూడు సంవత్సరాలు నిండని పసిబిడ్డపై పైశాచికత్వం ప్రదర్శిస్తోంది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీ నగర్‌లో సోమవారం తల్లి దాష్టికాన్ని భరించలేని ఇరుగుపొరుగు వారు రహస్యంగా సంఘటనను వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తల్లీ కొడుకులను సఖి సెంటర్‌కు అధికారులు తరలించారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఆంజనేయులు అనే వ్యక్తికి రమ అనే మహిళతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఆంజనేయులుకు గతంలో వివాహ జరిగినప్పటికీ మనస్పర్థల కారణంగా భార్యభర్తలు విడిపోయారు. ఈ విషయం వివరించి రమను నాలుగు సంవత్సరాల క్రితం ఆంజనేయులు రెండో వివాహం చేసుకున్నాడు. వీరిరువురు కొద్దికాలం కాపురం చేశారు. రమ ఆరునెలల గర్భవతిగా ఉన్న సమయంలో ఉపాధి నిమిత్తం ఆంజనేయులు దుబాయికి వెళ్లాడు. రమ తులసీనగర్‌లోని తమ ఇంట్లో కొడుకుతో నివాసం ఉంటోంది. కాగా దుబాయిలో ఉన్న ఆంజనేయులుకు జగిత్యాలలో ఉన్న రమకు మధ్య ఇటీవల మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. ఇంకో మహిళతో ఆంజనేయులు దుబాయి నుంచి తరచుగా ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు రమకు అనుమానం వచ్చింది. ఈ నేపథ్యంలో ఇంట్లో బాబు తరుచూ అల్లరి చేస్తుండడంతో చికాకు, మానసిక ఒత్తిడికి గురవుతున్న రమ ఇటీవల తరచూ బాబును కొడుతోంది. గతంలోనూ కొడుకును కిందపడేసి తొక్కుతుండడం, కొట్టడంతో స్థానికులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో పోలీసులు రమకు కౌన్సెలింగ్ ఇచ్చారని స్థానికులు అంటున్నారు. అయినప్పటికీ రమ పరిస్థితిలో మార్పురాలేదని మళ్లీ పసిబాబును బాదుతుండడం గమనించిన కాలనీవాసులు రహస్యంగా వీడియో తీసి అధికారులకు, సఖి సెంటర్ నిర్వాహకులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ అధికారి హరీశ్, సఖీ సెంటర్ అడ్మిన్ లావణ్య, ఇతర అధికారులు హుటాహుటిన తులసీనగర్‌లోని రమ నివాసానికి వెళ్లి రమను, బాబును సఖీ సెంటర్‌కు తరలించారు. రమకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇదిలాఉండగా పోలీసులు సైతం సంఘటనపై విచారణ జరుపుతున్నారు. కాగా బాబును కొట్టిన సంఘటనపై తన తప్పును తెలుసుకున్నానని, ఇక ముందు అలా చేయనని, మరోమారు చేసినట్లయితే కఠినచర్యలు తీసుకోవాలని సఖీ సెంటర్ అధికా రులతో రమ వేడుకుంది. రమకు మానసిక ఆరోగ్యం సరిగా లేదని కాలనీవాసులు అంటున్నారు. కాగా సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా కేసు నమోదు చేయడంతో పాటు సమగ్ర విచారణ చేపడతామని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

లారీ-ద్విచక్ర వాహనం ఢీ

● యువకుడు మృతి, మరొకరికి గాయాలు


నరేశ్(ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారం దర్గా సమీపంలో సోమవారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొని నరేశ్(18) అనేయువకుడు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండలం రాంపూర్‌కుచెందిన బోదాసు రాజు కుమార్, అల్లెపు నరేశ్‌లు ద్విచక్ర వాహనంపై జగిత్యాల వైపు నుంచి వస్తుండగా రాజారం దర్గా సమీపంలో లారీవెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికితీవ్రగాయాలు కాగా పోలీసులు జగిత్యాల ఆసుపత్రికి తరలించగా నరేశ్ చికిత్సపొందుతూ మృతిచెందాడు. నరేశ్ ఇటీవల ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్ శిక్షణకు వెళ్లి వస్తున్నక్రమంలో ప్రమాదం జరిగింది. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి


లస్మవ్వ(ఫైల్)

మెట్‌పల్లిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిరూరల్ మండలం జగ్గసాగర్ గ్రామశివారులోని వడ్డెరకాలనీకి చెందిన దుండుగుల లస్మవ్వ(44) భర్తతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ సోమవారం ప్రమాదవశాత్తు జారిపడిమృతిచెందింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. లస్మవ్వ భర్తతోకలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. భర్త దండుగులనర్సయ్య ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బసంత్‌నగర్ గ్రామానికి చెందిన దేవిశేఖర్(43) అనే లారీడ్రైవర్ వడదెబ్బతో సోమవారం మృతిచెందాడు. శేఖర్‌సిమెంటులోడుతో శనివారం వైజాగ్ వెళ్లాడు. ఆదివారం తిరుగుప్రయాణంలో వాంతులు, విరేచనాలు కావడంతో క్లీనర్ సహాయంతో 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని కుటుంబ సభ్యులుతెలిపారు. మృతదేహాన్ని వైజాగ్‌నుంచి బసంత్‌నగర్‌కు సోమవారం తీసుకు వచ్చారు. కాగా మృతుడికి భార్య కూతురు ఉన్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

● వరుస దొంగతనాలతో బెంబేలు ● తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

● పనిచేయని నిఘానేత్రాలు



గంభీరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలో ఇటీవల వరుసదొంగతనాలు జరుగుతున్నాయి. తాళాలు వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఊర్లకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. నాగంపేటలో శనివారం రాత్రి దొంగలు తాళాలు వేసిన 10 ఇళ్లలో బీభత్సం సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 10ఇళ్లలో దొంగతనానికి పాల్పడటంతో స్థానికులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏదో ఒకగ్రామంలో ఒకటిరెండు ఇళ్లకే పరిమితమైన దొంగతనాలు పది ఇళ్లకు విస్తరించడంతో వామ్మో ఇవేమి దొంగతనాలు అంటూ ప్రజలు వనికిపోతున్నారు. ఈ మధ్యనే కోళ్లమద్దిలో కూడా రెండు తాళాలు వేసిన రెండుఇళ్లలో దొంగలు బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కోళ్లమద్దిలో దొంగతనం జరిగి, వారం కూడా గడవక ముందే నాగంపేటలో దొంగలు ఏకంగా10 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.

పోలీస్ పెట్రోలింగ్ తిరుగుతున్నా..

గంభీరావుపేట మండలంలో ఓ వైపు పోలీస్‌లు రాత్రివేళల్లో పెట్రోలింగ్ తిరుగుతున్నా దొంగతనాలు ఆగడం లేదు. రాత్రి సమయాల్లో పోలీస్‌లు గ్రామాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ తిరుగుతున్నారు. అయినా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీస్‌లకు సవాల్‌గా మారిన ఈ వరుస చోరీలను నివారించాల్సిన అవసరం ఉంది. దొంగలు ఈ ప్రాంతానికి చెందిన వారా.. లేక ఇతర ప్రాంతాలకు చెందిన దొంగల మూఠా సభ్యులా అనేది అంతుచిక్కడం లేదు.

పనిచేయని నిఘా నేత్రాలు

గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చాలా వరకు పనిచేయడం లేదు. పలు సంఘటనలను నివారించేందుకు దోహదపడే నిఘానేత్రాలు పనిచేయకపోవడం కూడా సమస్యగా మారింది. ప్రధాన కూడళ్లలో అప్పట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నాగంపేటలో ఒక్క గ్రామ పంచాయతీ ముందు ఉన్న సీసీ కెమెరా మాత్రమే పనిచేయగా, మిగితా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గ్రామంలోని అన్ని సీసీకెమెరాలు పనిచేస్తే దొంగతనాలపై ఏదైనా క్లూ దొరికి ఉండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కొత్తపల్లి శివారులోని గుంషుల శ్రీనివాస్‌కు చెందిన మామిడితోటలో సోమవారం ఓవ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బసంత్‌నగర్ ఎస్ఐ తెలిపిన వివరాలమేరకు మంథని మండలం లక్కేపురం గ్రామానికి చెందిన పండుగు మొగిళి(45) ఇటీవల ఓ మహిళ హత్య కేసులో నిందుతుడిగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసుకు భయపడి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని మృతుడికుమారుడు అభిషేక్ ఇచ్చినఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

● ఎనిమిది మంది అరెస్ట్

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)! జగిత్యాల జిల్లాలో సోమవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసి ఎనిమిదిమంది పేకాటరాయు ళ్లను అరెస్ట్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రాయికల్ మండలం మైతాపూర్ శివారులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై, జగిత్యాల పట్టణంలోని భవాని నగర్‌లో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రెండు ఘటనల్లో ఎనిమిదిమంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 17,875 రూపాయల నగదు, ఎనిమిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఎస్ఐ రవీందర్, రమేష్, అఫ్రోజ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

● అర్ధాంతరంగా వెళ్లిపోయిన బీహార్ హమాలీలు


భూషణరావుపేటలో కొనుగోళ్లకు నోచుకోని ధాన్యం

కథలాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం భూషణరావుపేటలో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో ఐదురోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. బీహార్‌కు చెందిన హమాలీలు ఐదు రోజులు తూకం వేయగా నిర్వాహకులకు ఎలాంటి సమాచారం లేకుండా గురువారం వెళ్లిపోవడంతో ధాన్యం కొనుగోళ్ళు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచి ముద్దయి పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏపీఎం నరహరిని వివరణ కోరగా హమాలీ అర్ధాంతరంగా వెళ్ళిపోవడంతో కొనుగోళ్లు సాగడం లేదన్నారు. హమాలీల కోసం సమాచారం సేకరిస్తున్నామని మంగళవారం వరకు కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులకు వరం.. ఉపాధి హామీ పథకం

● చిన్న, సన్నకారు రైతులకు మేలు
● మౌలిక వసతులు, నీటి సంరక్షణ, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

చొప్పదండి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపాధి హామీ పథకం వరంలా మారింది. పారిశుధ్యం, నీటి సంరక్షణ, హరితహారం, చెక్‌డ్యాం, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలను చేపడుతున్నారు. వీటితో పాటు రైతులకు పశువుల పాకలు, గొర్రెల పాకలను ఇటీవల మంజూరు చేయగా నిర్మాణాలను చేపట్టారు. సన్న, చిన్నకారు రైతులకు పందిరి కూరగాయల సాగు, చేపపిల్లల పెంపకానికి కుంటలను ఏర్పాటు చేయడం, పొలం గట్లపై మొక్కల పెంపకం, ఫాంపాండ్‌లను నిర్మిస్తున్నారు. రైతుల కోసం ఉపాధిహామీ పథకంలో ఉన్న కొన్ని పథకాల వివరాలు...


ఫాం పాండ్ తవ్వుతున్న కూలీలు(ఫైల్)

● బీడు భూముల అభివృద్ధి పథకం...

బీడు భూముల్లో బండరాళ్ల తొలగింపు, మీటరు లోతు సరిహద్దు కందకం తవ్వుతారు. రాతి కట్టలు, భూమిని చదు ను చేసి పూడిక మట్టిని రైతుల పొలాలకు తరలింపు, చిన్న ఊటకుంటల నిర్మాణం చేపడుతారు.

● మెట్ట భూముల అభివృద్ధి...

మెట్ట భూముల్లో గుళకరాళ్ల కట్టలు నిర్మిస్తారు. ఫాం పాండ్‌ల నిర్మాణం, బావుల్లో పూడిక తీస్తారు. నాడెపు కం పోస్టు, ఎరువు గుంత, సేద్యపు బావుల తవ్వకం చేపడతారు.

● పందిరి కూరగాయల పెంపకం...

చిన్న, సన్నకారు రైతుల భూముల్లో కూరగాయల పెంపకం చేపట్టి సుస్థిర ఆదాయం కల్పించేందుకు పందిరి కూరగాయల పెంపకం కోసం సబ్సిడీ అందజేస్తారు.

● పండ్ల తోటల పెంపకం...

సన్నచిన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం కోసం ఉపాధిహామీ పథకంలో ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తుంది. ఈ పథకం కింద మామిడి, సీతాఫలం, మునగ, జామ, నిమ్మ, దానిమ్మ, కొబ్బరి, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్, సపోట, బత్తాయి, అల్లనేరేడు మొక్కలను అందజేస్తారు.

● పశువుల పాక నిర్మాణానికి వంద శాతం సబ్సిడీ..

ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్న కారు రైతులకు వంద శాతం సబ్సిడీపై పశువులు, గొర్రెలు, మేకలు, నాటుకోళ్ల షెడ్ల నిర్మాణాలకు యూనిట్లను మంజూరు చేస్తున్నారు. పశువుల పాక నిర్మాణం కోసం 85,340, గొర్రెలు, మేకల పాకకు 92,000, నాటు కోళ్ల షెడుకు 38,344, అజోల్లా పెంపకం కోసం ట్యాంకుల నిర్మాణానికి 6499 రూపాయలను రైతులకు అందజేస్తారు.

● జల సంరక్షణ...

జల సంరక్షణలో భాగంగా రైతులు తమ పొలంలో ఫాం పాండ్స్ నిర్మించుకోవచ్చు. నీటిని నిల్వ చేసుకునే అవసరానికి తగ్గట్టుగా వినియోగించుకోవచ్చు. ఊటకుంట, నీటి నిల్వ కందకాలు, ఫీడర్ కాల్వలు, పంట కాల్వల నిర్మాణం, పశువుల నీటి తొట్టె, చేప పిల్లల పెంపకం కుంటం, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపడతారు.


ఫాం పాండ్


పశువుల పాక


సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విజయరమణారావు

డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు...

గోదావరిఖని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంతంలోని అభివృద్ధి పనుల కోసం అవసరమైన డీఎంఎఫ్‌టీ నిధుల విడుదల చేయాలని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా ప్రజల ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రహదారి, ఆరోగ్యశిబిరాలు, విద్య సౌకర్యాలు కల్పించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు అత్యంత కీలకమని, ఇప్పటికే నిధులు మంజూరైనా విడుదల విషయంలో ఆలస్యం జరుగుతోదని, వెంటనే విడుదల చేసి అభివృద్ధి పనులకు సహకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ప్రత్యేకంగా మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్యత సంబంధిత శాఖలతో చర్చించి, త్వరితగతిన నిధుల విడుదల జరుగుతుందని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో ఆదివారం రాత్రి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన బదిలీలు, ప్రమోషన్లు, పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేస్తానన్నారు, విద్యారంగ అభివృద్దికి ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్లో మరింత నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల కేటాయింపులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారి జగిత్యాలకు విచ్చేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తపస్ జిల్లా శాఖ పక్షాన సత్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావు, ఇతర హోదాల బాధ్యు లు గడ్డం మహిపాల్‌రెడ్డి, మేన్నేని నీలిమ, చెరకు మహేశ్వర శర్మ, భాగ్యలక్ష్మీతో పాటు మండల బాధ్యులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్నప్రసన్నపై కొందరు దౌర్జన్యం చేయడం, బెదిరింపులకు పాల్పడడం వంటివాటిని ఖండిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వం డాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ ఏర్పాటుకు సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు తని ఖీలు చేస్తున్నారని తెలిపారు. తనిఖీకి వచ్చిన డీఎంహెచ్‌ఓకు సహకరించకుండా ఆమెపైన దౌర్జన్యానికి దిగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడమే తమ విధి నిర్వహణ అని, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. బెదిరింపులు, దౌర్జన్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల అందజేత



ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్‌ను అందుకుంటున్న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ కరీంనగర్ యూనిట్ స్థాయి ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు రిఫ్రిజిరేటర్, ఎల్‌ఈడీ టీవీని సోమవారం అందజేశారు. 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ డ్రా మార్చి 24న నిర్వహించారు. కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ద్వితీయ బహుమతి విజేత పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గొడుగు శివకృష్ణ కుటుంబ సభ్యులు రిఫ్రిజిరేటర్‌ను అందుకున్నారు. తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీని కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్ అందుకున్నారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి నగునూరి శేఖర్, ఎడిషన్ ఇన్‌చార్జి జయంత్‌రావు, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ పాపారావు పాల్గొన్నారు.


తృతీయ బహుమతి ఎల్‌ఈడీ టీవీ అందుకుంటున్న కరీంనగర్ కశ్మీరుగడ్డకు చెందిన అన్వర్ హుస్సేన్

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం


స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఏఈవో శ్రావణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివారిని టౌన్ సీఐ వీరప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. వీరప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయంలో జగ ద్గురు శంకరాచార్యులు జయంతి సోమవారం అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 28 నుంచి మే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించను న్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయ పలు విభాగాల్లో ఆకస్మిక తనిఖీ..:

రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో ఏఈవో శ్రావణ్ కుమార్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారిని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్యాధునిక పద్ధతుల్లో నిత్యాన్నదాన సత్రం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో నిర్మించే నిత్యాన్నదాన సత్రాన్ని ఆధునిక పద్ధతుల్లో నిర్మిస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శృంగేరి పర్యటనలో భాగంగా సోమవారం కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని నిత్యన్నదాన సత్రాన్ని, క్యూలైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని గుర్తుచేశారు. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈవో వినోద్‌రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి, అర్చకులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణి

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 30 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి శ్రీహన్సి ఎంపికైంది. హైదరాబాద్‌లో గత ఫిబ్రవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-11 ఎస్‌జీఎఫ్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న శ్రీహన్సి 1500 మీటర్ల రింక్, రోడ్ రేస్ విభాగా ల్లో రెండు బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీ లకు ఎంపికైందని జిల్లా పాఠశా లల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బిర్లా పాఠశాలకు చెందిన శ్రీహన్సిని సోమవారం డీఈవో జనార్దన్‌రావు, సెక్టోరి యల్ అధికారి అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ శిక్షకుడు హరి అభినందించారు.


శ్రీహన్సిని అభినందిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

అరచెయ్యే.. ఆటస్థలం..

● చిన్నారులు, యువతలో సెల్ గేమ్స్ క్రేజ్..
● మితిమీరితే కష్టమే

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు అర చేయి ఆట స్థలం అయింది.. ఆటగాళ్లు ఎందరున్నా, నియమాలు ఎలా ఉన్నా.. సెల్‌ఫోన్ స్టేడియంలో చిన్నారులు, కొత్తతరం కుర్రకారు, యువత ఒంటి చేత్తో ఆటలాడుతున్నారు. మొబైల్ గేమిం గ్ ధోరణి యువత జీవన శైలిలో ఓ భాగమైంది. అర చేతిలో ఇమిడే సెల్‌ఫోన్ ఇప్పుడు సరికొత్త కాలక్షేపంగా అలరిస్తోంది. మొదట్లో సెల్‌ఫోన్ కొనగానే అందులో కొన్ని గేమ్స్ మాత్రమే ఉండేవి. వాటిని ఆడుతూనే ఎంతో ఆనందించేవారు. చిన్నపాటి గేమ్స్‌కు ఉన్న ఆదరణను చూసే ప్రత్యేకంగా త్రీడి, జావా గేమ్స్‌ను తయారు చేసే సంస్థలు పుట్టుకొచ్చాయి. వింత లోకంలోకి లాక్కెళ్లే సెల్‌ఫోన్ గేమ్స్ ఎంతో ఆదరణ పొందుతూ ఓ కొత్త ధోరణికి మార్గం ఏర్పరిచాయి. గేమ్స్‌లో సరికొత్త ట్రెండ్స్ కూడా వేగంగా దూసుకొస్తున్నాయి.



● **వేగంగా వ్యాప్తి..:** కొత్త మొబైల్ గేమ్ మార్కెట్‌లోకి వస్తే చాలు.. చిన్నారులు, విద్యార్థులు, యువత యువకుల్లో సమాచారం వేగంగా వ్యాపిస్తోంది. గేమ్స్‌కు అలవాటు పడుతున్న వారంతా బ్బం దాలుగా మారిపోతున్నారు. పాఠశాలలు, కళాశాలల కూడళ్లలో సమయం దొరికినప్పుడల్లా వీటి గురించే చర్చలు నడుస్తున్నాయి. సరదాలు, షికార్లకు కొదవలేని సమయం కావడంతో వారు కొత్త దనం కోసం అర్రులుచాస్తున్నారు. ఎప్పటికప్పుడూ అంది వచ్చే సరికొత్త సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా మొబైల్ సంస్థలు. ఇంటర్‌నెట్‌లో గేమింగ్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకుంట్ను వాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

● **గేమ్స్‌తో జాగ్రత్త.. :** మొబైల్ గేమింగ్‌తో కాలక్షేపం మాట అటుంచితే.. ఇదొక వ్యసనంగా మారుతుందని మానసిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి దశలో విలువైన సమయాన్ని వృథా చేసుకుంటూ సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

ఇన్నాళ్లూ కంప్యూటర్ గేమ్స్‌తోనే సరిపెట్టుకునే వారంతా మొబైల్ గేమ్స్‌కు మారిపోతున్నారు. ఎందుకంటే సెల్‌ఫోన్ ఎక్కడికైనా తీసుకెళ్లే వెసులుబాటు ఉండడటంతో ఈ పరిస్థితి వచ్చింది. మొబైల్ గేమింగ్ వల్ల మానసిక ఆలసట, చదువు మీద ఏకాగ్రత లోపించడం వంటి దుష్ప్రభావాలు కూడా కలుగుతున్నాయి. వ్యసన పరులుగా మారితే మాత్రం ఎన్నో ప్రతికూల ప్రభావాలను చవి చూడాల్సి వస్తుంది. విద్యార్థులు సెల్‌ఫోన్ ఆటలతో శారీర కంగా, మానసికంగా బలహీనులవుతున్నారు. ఆలోచన శక్తి సన్నగిల్లుతుంది. విద్యలో వెనుకబడుతారు. సెల్‌ఫోన్ గేమ్స్‌తో విద్యార్థులు ఇతర పనులపై ఆసక్తి చూపకుండా పోయే ప్రమాదం ఉంది.

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలి


పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య పేర్కొన్నారు. ట్రినిటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం జరిగిన డీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యా కమిషన్ కలిసి ఒక నిర్ణయానికి వస్తున్నారని, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలను మూసివేయడంలో భాగంగా మండలానికి ఆరుప్రాథమిక పాఠశాలలను మూడు ఉన్నత పాఠశాలలను మాత్రమే ఉంచాలనే సంకల్పంతో చర్చలు జరగుతున్నాయని, అలా చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే పాఠశాలలను సెమిరెసిడెన్షియల్‌గా తీర్చిదిద్దాలని, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, సాయంకాలం టిఫిన్ అందిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంటుందన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే.నారాయణరెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలు, పెన్షన్, మెడికల్ బిల్స్ జాప్యం చేయకుండా బడ్జెట్‌ను వెంటనే అందించాలని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రామ్‌కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సభ్యులు కిషన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్ స్వర్ణకారులు

భగత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్‌కు కరీంనగర్‌కు చెందిన స్వర్ణకారులు పూర్ణాచారి, రవీంద్రాచారి ఎంపికయ్యారు. బిహార్‌లోని బుద్ధగయలో ఆదివారం అఖిల భారతీయ స్వర్ణకార్ సంఘ్ జాతీయ శాఖ అధ్యక్షుడు యశ్పాల్ చౌహన్, ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేవూరి వెంకటస్వామి ప్రతిపాదించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కందు కూరి పూర్ణాచారిని జాయింట్ సెక్రటరీగా, శ్రీరామోజు రవీంద్రాచారిని జాతీయ ఈసీ మెంబర్‌గా ప్రకటించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు.


పూర్ణాచారి, రవీంద్రాచారికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

స్వరూప, కొడిమ్యాల ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తున్నారు?

ఎంపీడీవో: ఇళ్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారా?

ఎంపీడీవో: గ్రామాల్లో సెక్రెటరీలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే చేయించాం. ఇందిరమ్మ కమిటీలకు లబ్ధిదారుల జాబితాను అందించాం. ఇందిరమ్మ కమిటీ నివేదిక అనంతరం మండల స్థాయి గెజిటెడ్ అధికారులతో పునఃపరిశీలన చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ప్రక్రియ వేగవంతానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించిన తర్వాత కలెక్టర్‌కు జాబితాను నివేదిస్తాం. లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు చోటు లేకుండా పారదర్శంగా ఎంపిక చేస్తాం.

-కొడిమ్యాల

బొమ్మెనలో బడి బాట

కథలాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని బొమ్మెన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి వసతులు కల్పించబడతాయని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిం చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే బోధన కొనసాగుతుందని వివరించారు. బడిబాట కార్యక్రమంలో కొత్తగా 18 మంది విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చామని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుకర్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంధర్, రవి, భారతి, జయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

బసవేశ్వర జయంతికి సీఎంకు ఆహ్వానం

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 30వ తేదీన జరిగే రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే బసవేశ్వర జయంతి కార్యక్రమానికి రావాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉత్సవ కమిటీ నాయకులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

సోమవారం హైదరాబాద్‌లో బసవేశ్వర ఉత్సవ కమిటీ నేతలతో పాటు జగిత్యాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు గుంటి జగదీశ్వర్‌లు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఇందుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు జగదీశ్వర్ తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

-అదనపు కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను బాధ్యతగా పాటించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి రోడ్డు భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2021 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలను సమీక్షించారు. కొత్తగా నిర్మాణం జరిగే రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్స్, పలువురు పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కొడిమ్యాల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం మండలంలోని నల్లగొండ గ్రామంలో పూడూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ధాన్యం తూకం వేయాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట డీసీఎస్‌వో జితెందర్‌రెడ్డి, తహసీల్దార్ జి.రమేష్, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహస్వామి, ఆర్‌ఐ కరుణాకర్, పూడూర్ సింగిల్ విండో కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, సిబ్బంది, పలువురు రైతులు ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

-జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్



హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులు, హమాలీలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ సూచించారు. ధర్మపురి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రైతులు, హమాలీలకు మండల తహసీల్దార్ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సోమవారం ఆయన చల్లని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ వల్ల ఇబ్బంది కలుగ కుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు మార్కెట్ యార్డులో అందు బాటులో ఉంచామని పేర్కొన్నారు. రైతులు, హమాలీలకు ఇబ్బందులకు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటనర్సయ్య, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్‌కుమార్, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లపై విక్రయాలు జరిపితే చర్యలు'

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పండ్ల వ్యాపారులు, వివిధ జనరల్ సామాగ్రికి సంబంధించిన విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. మున్సిపల్ కమీషనర్ టి. మోహన్ ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ సిబ్బంది రోడ్ల పై విక్రయాలు జరుపుతున్న పండ్ల దుకాణాల యజమానులకు 2 వేల జరిమాన విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై ముందుకు వచ్చి పండ్ల బండ్లు,ఇతర వస్తువులు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమించి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నాయక్, మహిపాల్, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి

వెల్గటూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు వెంటది వెంట రైతు ఖాతాల్లో జమ చేయాలని జిల్లా సహకార అధికారి సిహెచ్. మనోజ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్. జితేందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం వెల్గటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని సంఘ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ కె. నాగసంకీర్త్, సంఘ కార్యదర్శి ఎస్. పూర్ణ చందర్, స్టాప్ అసిస్టెంట్ అనిల్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

● పట్టించుకోని అధికారులు ● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కోరుట్లలోని కూడలిలో నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్

కోరుట్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ అలంకార ప్రాయంగానే మిగిలి పోయాయి. మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణం లోని కల్లూర్ ఎక్స్ రోడ్డు, నంది చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని రోజులు పని చేసినా వాటి నిర్వహణ సక్రమంగా నిర్వహించలేదు. దీంతో కల్లూర్ రోడ్డుతో పాటు నంది చౌరస్తాలలో వాహన చోదకులు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. లక్షలు వెచ్చించి సిగ్నల్ ఏర్పాటు చేసినప్పటికీ నిరుపయోగంగా మారిపోయాయి. ఇప్పటికైనా పోలీసులు సిగ్నల్స్‌పై వాహన చోదకులు అవ గాహన కల్పించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో సరియైన సిబ్బంది లేకపోవడం వాటి నిర్వహణపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

'ఎర్లీ బర్డ్'కు స్పందన

(5వ పేజీ తరువాయి)

18.21 శాతం వరకు ఈ ఒక్క నెలలోనే వసూలైంది. మున్సిపాలిటీలకు ఉన్న ఆదాయ వనరుల్లో సింహభాగం ఆస్తి పన్ను ద్వారానే సమకూరుతుంది. వీటి ద్వారా సిబ్బంది, పెన్షన్‌దారుల జీత భత్యాల చెల్లింపులు, ఇతరత్రా ఖర్చులు చేస్తుంటారు.

● రాయికల్‌లో 23.02 శాతం వసూళ్లు

ఎర్లీ బర్డ్ పథకం అమలులో రాష్ట్రంలోనే రాయికల్ మున్సిపాలిటీకి పదో స్థానం లభించింది. రాష్ట్ర సగటు ఆస్తి పన్ను వసూలు 12.55 శాతం ఉంది. ఇందులో జగిత్యాల జిల్లాలోని అయిదు మున్సిపాలిటీలు సగటున 18.21 శాతం సాధించాయి. జిల్లాలో అత్యధికంగా 23.02 శాతం లక్ష్యాన్ని సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన రాయికల్ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో పదో స్థానాన్ని దక్కించుకుంది. కాగా ఈనెల 30వ తేదీ వరకు ఎర్లీబర్డ్ పథకం కింద ఆస్తి పన్ను చెల్లింపులో రాయితీ పొందడానికి అవకాశం ఉంది.

అన్ని వర్గాల సహకారంతో పన్ను వసూళ్లు

-మనోహర్, రాయికల్ మున్సిపల్ కమిషనర్



అన్ని వర్గాల ప్రజల సహకారంతో ఎర్లీబర్డ్ స్కీంలో పన్ను వసూళ్లలో రాష్ట్రంలోనే పదో స్థానంలో ఉన్నాం. ఎర్లీ బర్డ్ కార్యక్రమం తీరును ప్రజలకు వివరించి పన్ను చెల్లించడానికి ప్రోత్సహించాం. ప్రత్యేకమైన ప్రణాళికతో అధికారులు, ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులు అంచనా మేరకు వసూళ్లు పూర్తి చేశారు. రెండు సంవత్సరాలుగా ఆస్తి పన్ను చెల్లింపులో ఆశించిన ఫలితాలు సాధించడంతో రాయికల్ మున్సిపాలిటీకి ప్రోత్సాహకం సైతం అందిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించడం సంతోషంగా ఉంది.

మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలి

-ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెగడపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ పిలుపునిచ్చారు. పెగడపల్లి మండల కేంద్రంలో సోమవారం మే డే 139వ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను భూమేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1న కార్మిక దినోత్సవం ఘనంగా జరుపుకోవాలన్నారు. మండలంలోని కార్మికులందరు జండా పండుగకు హాజరై విజయవంతం చేయాలని భూమేశ్వర్ కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా శనిగరపు ప్రవీణ్, మండల కన్వీనర్ రాచర్ల సురేష్, శేఖర్, గంగాధర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

రాయికల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో సోమవారం నిజామాబాద్ అడహక్ కమిటీ సభ్యుడు సోమ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దండుగుల గంగు, దండుగుల మల్లేష్, శివరాత్రి రజిత ఇంటికి వెళ్లి సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొల్లారపు రాజేశం, పల్లికొండ రాజేశం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్‌కు 24 దరఖాస్తులు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో ఓ బార్‌కు దరఖాస్తులు ఆహ్వానించగా 24 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి తెలిపారు. ఈ దరఖాస్తు వల్ల ప్రభుత్వానికి 24 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు 29వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌కు ఉదయం 10 గంటలలోగా రావాలని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

మల్లాపూర్, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని సిర్పూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేను మల్లాపూర్ వ్యవసాయాధికారి లావణ్య క్షేత్ర స్థాయిలో చేపట్టారు. ఇందిరమ్మ జాబితా ప్రకారం సోమవారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి వివరాలు, ప్రస్తుతం పరిస్థితిలు, తదితర అంశాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్మాణ పనులను పరిశీలించినంతరం ప్రభుత్వం బిల్లులను మంజూరి చేస్తుందని సూచించారు. వెంట ఇందిరమ్మ ఇండ్ల కమిటీ నాయకులు, మాసీ సర్పంచ్ బాపురెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో నిర్మాణం చేసుకునే వారిని ప్రభుత్వ ఆదేశాలతో పకడ్బందిగా సర్వే చేసి గుర్తించడం జరుగుతుందని మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఎంపిక చేయగా ఉన్నత అధికారుల ఆదేశాలతో సోమవారం మండలంలోని చౌలమద్ది గ్రామాల్లోని దరఖాస్తు దారుల ఇంటికి ఆయన వెళ్లి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు కేవలం అర్హులకు లబ్ధి జరిగేలా ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నత అధికారులు సూచనలతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ప్రస్తుతం నివసి స్తున్న ఇంటి స్వరూపం, ఇళ్లు నిర్మించుకునేందుకు భూమి అందుబాటులో ఉందా ? లేదా ? స్థలం ఉంటే ఎవరి పేరిట ఉంది, ఇంట్లో ఉన్న వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుతం నివాసం ఎన్నేళ్లుగా ఉంటున్నారు. లబ్ధిదారు దివ్యాంగులా, అనాథలా, ఒంటరి మహిళా, వితంతువా, ట్రాన్స్ జెండర్లు, పారిశుధ్య కార్మికులు వంటి పలు అంశాలను గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, కారోబార్ రాములు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

యమధర్మరాజు ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ యమ ధర్మరాజు ఆలయంలో సోమవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, రాపర్తి సాయికుమార్, అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ, ప్రదీప్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

● ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్, జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ జిల్లా విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ముందస్తు అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నా జగిత్యాలలోని ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో పుస్తకాలు అమ్ముతూ విద్యను వ్యాపారంగా మారుస్తు న్నారని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని పాఠశాలలు అనుమతులు లేకుండా నిర్వహణ సాగుతున్నాయని విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడం దురదృష్టకరం అన్నారు. విద్యార్థులకు సెలవులు వచ్చినప్పటికీ వేసవి సెలవుల్లో ప్రత్యేక క్లాసుల పేరుతో తరగతులు నిర్వహిస్తున్నారని ఇంటర్మీడియేట్ , డిగ్రీ కళాశాలలు నిబంధనలు సైతం నిబంధనలు పాటించడం లేదని ఇంటర్మీడియేట్ అధికారులు, యూనివర్సిటీ అధికారులు స్పందించి ఫీజులు, తరగతుల నిర్వహణ అడ్మిషన్లు తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీవీపీ బాధ్యులు కుందారపు రాజు, రాపాక నిఖిల్, మనోజ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● నిబంధనలు పాటించకుండా గుర్తింపు కొరకు దరఖాస్తు చేసుకునే పాఠశాలలకు గుర్తింపు ఇవ్వొద్దని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం డీఈవో రామును కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలోని మెట్‌పల్లి ప్రాంతంలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న పాఠశాలలు తప్పుడు ధృవపత్రాలు అందించినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కనీస మౌలిక సదుపాయాలకు అనుగుణంగా బిల్డింగ్‌లు లేవని, పిల్లలకు ప్రతిజ్ఞ చేయించడానికి సైతం స్థలం లేని వాహనాలు వెళ్లడానికి కూడా అనుకూలంగా లేని విధంగా పాఠశాల ఏర్పాటు జరుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకం కాదన్నారు. విద్యా వ్యతిరేక విధానాలు పాటిస్తున్న పాఠశాలలకు మాత్రమే వ్యతిరేకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ బాధ్యులు అక్రమాలిక్, అరవింద్, నవీన్, సులేమాన్, దిల్షాన్ తదితరులున్నారు.


కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన

కొడిమ్యాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాల ఎదుట కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న నిరసన సమ్మె సోమవారం పదవ రోజుకు చేరుకుంది. తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మెలో బాగంగా కాంటాక్ట్ అధ్యాపకులు మోకాళ్ళపై ఉండి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాటట్లాడుతూ తాము 10 రోజులుగా నిరవదిక సమ్మె చేస్తున్న ఎవ్వరు పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేం చేస్తున్న సేవలను గుర్తించి మా గౌరవాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంటాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అభినందన

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వెంకటేశ్ గౌడ్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సోమవారం అభినందించారు. హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఎస్పీని వెంకటేష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహిస్తూ పోలీస్ శాఖ పట్ల గౌరవాన్ని పెంచే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు.

అంబేద్కర్ కృషితోనే అన్నివర్గాల అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ కృషితోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల మండలం ధరూర్ గ్రామంలో సోమవారం జైబాపు.. జైభీమ్ సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ధరూర్ శివారులోని అంబేద్కర్ విగ్రహానికి మాజీమంత్రి జీవన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సారెస్పీ కాలువ నుంచి జగిత్యాల జాతీయ రహదారి వెంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ పేరిట ఓట్లు దండుకున్నారని, అభివృద్ధి ముసుగులో కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేను మీది ఏపార్టీ అని నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జున్ను రాజేందర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం సురేందర్, నాయకులు చందారాధకిషన్, రఘువీర్‌గౌడ్, గుండామధు, మొగిలి, శివకుమార్, మల్లేశం, దుర్గయ్య పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్‌పై నిర్మల్ జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్తున్నందున ఆయనను సోమవారం మున్సిపల్ కమిషనర్ టి.మోహన్, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, టిపిఓ రాజేంద్ర ప్రసాద్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఆర్‌ఐ అక్షయ్, జేఓ రమేష్ పాల్గొన్నారు.

రాయికల్‌వాసికి డాక్టరేట్

రాయికల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన కాయితి శంకర్‌కు లండన్‌లోని మెక్సికో టొలాసా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ఆదివారం మహారాష్ట్ర నాసిక్ రాయల్ హోటల్‌లో అందించి ఘనంగా సత్కరించారు. శంకర్ పాత్రికేయుడిగా, అంబేద్కర్ వాదిగా, సమాజంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలను చైతన్యం చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తుండడంతో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌ను సమతా సైనిక్‌దళ్ నాయకులు దాస్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు లింగన్న, సంజయ్ అభినందించారు.

పనుల పరిశీలన

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులో ఎస్ఆర్ఎస్‌పీ ప్రధాన కాల్వనుంచి తాగు నీరు అవసరాల కోసం నీటి మళ్లింపు పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పరిశీలించారు. ఎస్ఆర్ఎస్‌పీ కాల్వ నుండి పట్టణ శివారులోని తాళ్ల చెరువులో నీరు నింపి పట్టణంలో తాగు నీరు అందించడానికి ఏర్పాట్లను చేస్తున్నారు. కాల్వలో నీటి మళ్లింపు కోసం ఇసుక బస్తాలను వేసి అక్కడి నుంచి మాటు కాల్వ ద్వార తాళ్ల చెరువు నింపే విధంగా ఏర్పాట్లును చేస్తున్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడారు. పట్టణంలో తాగు నీటి ఎద్దడి రాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాల్వ నుంచి తాళ్ల చెరువు నింపనున్నట్లు తెలిపారు.